www.kalamdaily.com

Follow on: Kalamtelugu

# కలం

ప్రజల గళం...

మంగళవారం, 03-03-2026

360° SINGLE TOPIC

గవర్నెన్స్



మంగళవారం సెక్రటేరియెట్‌లో కలెక్టర్లతో సీఎం రేవంత్ కాన్ఫరెన్స్



## సీఎం వర్సెస్ సివిల్ సర్వెంట్స్

# అనుమానం.. ఆవేదన..!



**పాత సర్కార్ వాసనలను మరవట్లేదని కొందరు ఆఫీసర్లపై ఆరోపణలు**

**అలాంటి వారిపైనే సీఎం రేవంత్ రెడ్డి సీరియస్**

**అదే లెక్కలో తమనూ చేరుస్తున్నారని ఇంకొందరు బ్యూరోక్రాట్ల గోడు**

**కలెక్టర్ల కాన్ఫరెన్సులు జరిగే ప్రతిసారీ ఇదో హాట్ టాపిక్**

– తెలంగాణ బ్యూరో, కలం

ముఖ్యమంత్రి స్పీడ్‌ను బ్యూరోక్రాట్లు అందుకోలేకపోతున్నారా?.. ఆయన అనుకున్నట్లుగా గ్రౌండ్ లెవల్‌లో విజన్ ఎగ్జిక్యూట్ కావడం లేదా?.. అధికారులు ఫీల్డ్ లోకి వెళ్లడానికి సుముఖంగా లేరా?.. ఏసీ గదులకు అలవాటుపడ్డారా?.. గత ప్రభుత్వంతో అంటకాగిన కొందరు పాత పద్ధతులనే కొనసాగిస్తున్నారా?.. ఇలాంటి చర్చల నడుమ నాలుగు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన కామెంట్లు సరికొత్త వాదనకు తావిచ్చాయి. అధికారుల పనితీరుపై ఆయన అసంతృప్తికి ఈ కామెంట్లు అద్దం పడుతున్నాయి. రెండున్నరేళ్లయినా అధికారులు గాడిన పడలేదన్నది సీఎం మాటల ద్వారా అర్థమవుతున్నది. ఇకపైన కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదనే నిర్ణయానికి వచ్చారు. గతేడాది జూలైలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ తర్వాత ఎనిమిది నెలలు గడిచినా అదే ట్రెండ్ కొనసాగుతూ ఉన్నదన్నది సీఎం తాజా వ్యాఖ్యలతో స్పష్టమవుతున్నది. కొందరు అధికారుల తీరుపై ముఖ్యమంత్రితోపాటు మంత్రుల అనుమానం.. అదే గాటిలో తమనూ కట్టేస్తున్నారన్నది మరికొందరు ఆఫీసర్ల ఆవేదన! పాలనలో జోడెద్దుల మాదిరిగా ఉండాల్సిన పాలకులు, బ్యూరోక్రాట్ల నడుమ ఈ గ్యాప్ తొలగేదెప్పుడు?! ఇప్పటికే హనీమూన్ పీరియడ్ ముగించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి.. రాబోయే రెండున్నరేండ్లు కీలకం. రాష్ట్ర ప్రజల మనసు గెలుచుకోవాలన్నా.. తిరిగి అధికారంలోకి రావాలన్నా.. అంతా సెట్‌రైట్ కావాల్సిందే!! సీఎం వర్సెస్ సివిల్ సర్వెంట్స్‌గా కొనసాగుతున్న ఈ అనుమానాలు, ఆవేదనలు ఎటు దారితీస్తాయన్నది హాట్ టాపిక్.

దీనిపై కలం 360 డిగ్రీస్ స్పెషల్...



## సెక్రటరీల మీటింగ్‌లో హాట్ కామెంట్స్

కలెక్టర్ల కాన్ఫరెన్సుకు నాలుగు రోజుల ముందు వివిధ విభాగాల సెక్రటరీలతో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు సచివాలయంలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు తగ్గట్టు అధికారులు పనిచేయడంలేదన్న భావనతో ఇకపైన కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సున్నితంగానే వార్నింగ్ ఇచ్చారు. ఆ సమావేశంలో సీఎం చేసిన కామెంట్లలో కొన్నింటిని ఆఫీసర్లు సూచనప్రాయంగా తెలిపారు. “ఏయే అధికారి ఏం పనిచేస్తున్నారో నా దగ్గర పూర్తి సమాచారం ఉన్నది.. అధికారులు రిటైర్ అయిన తర్వాత కూడా ప్రజలు గుర్తుంచుకునేలా పనిచేయాలి.. అధికారుల మధ్య ఇగోల వార్ నడుస్తున్నది.. కొన్ని డిపార్టుమెంట్ల మధ్య సమన్వయం లేదు.. ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి తగినట్లుగా సీరియస్ దృష్టి పెట్టడంలేదు..” అని సీఎం కామెంట్లు చేయడం గమనార్హం.

## రెండున్నరేళ్లయినా మారని పనితీరు

ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లయినా మంత్రివర్గానికి, అధికారులకు మధ్య పకడ్బందీ సమన్వయం లేదన్నది సీఎం రేవంత్ మాటల ద్వారా వెల్లడవుతున్నది. ప్రభుత్వం ఏ పార్టీకి చెందినదైనప్పటికీ మంత్రివర్గం తీసుకునే నిర్ణయాలకు తగ్గట్టు ఆఫీసర్లు పనిచేయక తప్పదు. అధికారులను ప్రభుత్వం తనవైపు తిప్పుకోలేకపోతున్నదా?.. ప్రభుత్వ ప్రాధాన్యతలను వారికి అర్థం చేయించలేకపోతున్నదా?.. గడిచిన పదేండ్లలోని అప్పటి అధికార పార్టీతో ఇప్పటికీ కొందరు అధికారులకు సంబంధాలు ఉన్నాయనే అనుమానమున్నదా?.. కొన్ని పాలసీలు ప్రతిపక్షానికి ముందుగానే లీక్ కావడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నదా?.. ప్రభుత్వాన్ని అధికారులు విశ్వాసంలోకి తీసుకోవడం లేదా?.. ఆఫీసర్లను ప్రభుత్వం అనుమానం దృష్టితో చూడడం వారిని డీమోరల్ చేస్తున్నదా?.. ఇలాంటివన్నీ కిందిస్థాయి సిబ్బందిలో నడుస్తున్న చర్చలు.

## సీఎం కామెంట్లతో ఆఫీసర్లలో ఆవేదన

ముఖ్యమంత్రి వేర్వేరు సందర్భాల్లో చేస్తున్న కామెంట్లు కొన్నిసార్లు ఆవేదనకు గురిచేస్తున్నాయని కొందరు ఆఫీసర్లు వాపోతున్నారు. “పనిచేయని అధికారుల లిస్టు నా దగ్గరున్నది.. వారి పర్ఫార్మెన్స్ రిపోర్టును వెల్లడిస్తా.. సరిగా పనిచేయనివారు పద్ధతులను మార్చుకోవాల్సిందే.. లేదంటే వారే స్వయంగా పక్కకు తప్పుకోవాలి.. అలా కాకుంటే అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేస్తాం... కొన్ని రాష్ట్రాల్లో బలవంతపు రిటైర్‌మెంట్ విధానాలు అమలవుతున్నాయి.. అవసరమైతే దాన్ని కూడా పరిశీలించి ప్రయోగిస్తాం..” అని సీఎం చేస్తున్న వ్యాఖ్యలు బాధిస్తున్నాయన్నది ఒకరిద్దరు బ్యూరోక్రాట్ల ఆవేదన. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో “గతంతో పోలిస్తే ఇప్పుడు స్వేచ్ఛగా పనిచేసుకోగలుగుతున్నాం.. మేం చెప్పిన అభిప్రాయాలను ముఖ్యమంత్రి ఓపిగ్గా వింటున్నారు.. సమావేశాల్లో మాకు మాట్లాడే అవకాశం లభిస్తున్నది..” అని సంతృప్తిపడుతున్న ఆఫీసర్లూ కొందరున్నారు.



16-7-2024

## ‘ఎకో సిస్టమ్’ వైఫల్యాల దుష్పరిణామం

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం, బ్యూరోక్రాట్లు జోడెద్దులలాగా, రైలు పట్టాల్లాగా సమాంతరంగా పనిచేయాలన్నది తరచూ మనం వినే మాటలు. ముఖ్యమంత్రి సైతం.. కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఎస్ఆర్ శంకరన్ గురించి చెప్తూ ఉంటారు. ఇటీవలే ‘గరం, నరం, బేశరమ్’ అనే కామెంట్ కూడా చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పక్కా సమన్వయంతో, సహకారంతో, పరస్పర విశ్వాసంతో పనిచేస్తే ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉంటాయన్నది చాలా మంది పొలిటీషియన్లు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు చెప్పే మాట. అటు లెజిస్లేచర్, ఇటు ఎగ్జిక్యూటివ్ బాడీ ఒకే ‘ఎకో సిస్టమ్’ పని చేయాలని, లేదంటే అది దుష్పరిణామాలకు దారితీస్తుందని, దాని ఫలితం అంతిమంగా రాష్ట్రంపైనా, ప్రజలపైనా పడుతుందన్నది కూడా వారి మాటల్లో వినిపిస్తుంది.



10-1-2025



24-12-2023

## ప్రభుత్వానికి, బ్యూరోక్రాట్లకు అగ్నిపరీక్ష

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి రెండేళ్లు హనీమూన్ పీరియడ్ లాంటిదని రాజకీయ పార్టీలు భావిస్తూ ఉంటాయి. ఆ పీరియడ్ అయిపోయింది. రాబోయే కాలమంతా అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు అగ్నిపరీక్ష లాంటిది. బదిలీ చేయాలా?.. లేక లూప్‌లైన్‌లోకి పంపాలా?.. లేక లాంగ్ లీవ్‌లో వెళ్లేలా చేయాలా?.. లేక వాలంటీర్‌గా రిటైర్ అయ్యే స్ట్రాటజీని అమలు చేయాలా?.. ఇవన్నీ ప్రభుత్వ పరిధిలోని అంశాలు. ముఖ్యమంత్రి మనసును గెల్చుకోడానికి, ఆయన అనుకున్నంత వేగంగా పనిచేసి పర్ఫార్మెన్స్ ద్వారా నిరూపించుకోవడం ఆఫీసర్ల వంతు. పోయినచోటనే వెతుక్కోవాలన్న తీరులో ఎక్కడ అసంతృప్తి వెల్లడైందో అక్కడే సంతృప్తి పొందేలా పనితీరు ద్వారా ప్రూవ్ చేసుకోవడం ఆఫీసర్లకు తప్పనిసరిగా మారింది. అనుమానం, ఆవేదన స్థానంలో విశ్వాసం, సంతృప్తి నెలకొనేలా ‘ఎకో సిస్టమ్’ మెరుగుపడేలా ప్రభుత్వం, బ్యూరోక్రాట్లు రానున్న రోజుల్లో అనుసరించే వైఖరి కీలకం.